క్లుప్తంగా

శ్రీశైలం చేరుకున్న బుడ్డా శేషారెడ్డి



పార్టీ నాయకులు, కార్యకర్తలతో బుడ్డా శేషారెడ్డి

శ్రీశైలంటెంపుల్: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుడ్డా శేషారెడ్డి శనివారం శ్రీశైలం వచ్చారు. శ్రీశైలం చేరుకున్న బుడ్డా శేషారెడ్డికి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, బుడ్డా శేషారెడ్డి అభిమానులు పుష్పగుచ్ఛాలు, శాలువాలు కప్పి ఘన స్వాగతం పలికారు. అనంతరం ప్రైవేట్ అతిథిగృహంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో శ్రీశైలంలో జరిగిన అభివృద్ధి, పార్టీ కార్యక్రమాలపై చర్చించారు. ఆదివారం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి శ్రీశైలంలో ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభిస్తారని చెప్పారు.

23న ఎద్దుల బండలాగుడు పోటీలు

కొత్తపల్లి: ఈనెల 23న మండల పరిధిలోని జీ.వీ రాపురం గ్రామంలో 6 పళ్ల విభాగం ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రామపెద్దలు శనివారం తెలిపారు. గ్రామంలో వెలసిన శ్రీశ్రీశ్రీ సుంకుల పరమేశ్వరి దేవి పుట్టినరోజు సందర్భంగా గ్రామస్తుల సమక్షంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పోటీలలో పాల్గొనదలచినవారు 23న ఉదయం 7 గంటల లోపు ప్రవేశరుసుము రూ.500 చెల్లించి పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. విజేతలకు వరుసగా రూ.35వేలు, రూ.25వేలు, రూ.20వేలు, రూ.15 వేలు, రూ.10వేలు, రూ.5వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. వచ్చిన ప్రజలందరికీ భోజన వసతి ఉంటుందన్నారు. పూర్తి వివరాల కోసం నాగిరెడ్డి 9666539279, శివారెడ్డి 9866783974, మహేష్ 8096814685, హరిప్రసాద్ రెడ్డి 9951053466, మల్లారెడ్డి 9963019710 నంబర్లను సంప్రదించాలని కోరారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు



చేతి పంపు మరమ్మతు చేయిస్తున్న సర్పంచు మౌలాలి

పాములపాడు: మండలంలోని ఇస్కాల గ్రామంలో నీటి ఎద్దడి నివారణకు సర్పంచు మౌలాలి చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా శనివారం చేతి పంపులకు మరమ్మతులు చేయించారు. చేతి పంపుల్లో కొత్త పైపులు ఏర్పాటు చేశారు. నీటి కొరత ఉత్పన్నం కాకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామని సర్పంచు పేర్కొన్నారు. ఆయన వెంట పీఎంసీ చైర్మన్ మాలిక్, తదితరులు ఉన్నారు.

రాజీనామా ఆమోద పత్రాలు తీసుకోండి

కొత్తపల్లి: రాజీనామా పత్రాలను అధికారులకు అందజేసిన గ్రామ వలంటీర్లు వారి రాజీనామా ఆమోద పత్రాలను తిరిగి పొందాలని ఎంపీడీఓ జవహర్‌బాబు శనివారం తెలిపారు. ఈ నెల 19న కొత్తపల్లికి చెందిన 11 మంది గ్రామ వలంటీర్లు రాజీనామా చేస్తూ ఆ పత్రాలను అధికారులకు ఇచ్చారన్నారు. అయితే అంతటితో వారు రాజీనామా చేసినట్లు కాదని, ఎంపీడీఓ ఆమోదించినట్లుగా ఆమోద పత్రం వారు తీసుకుంటేనే రాజీనామా చేసినట్లని చెప్పారు. రాజీనామా చేసిన ఏ వలంటీర్ కూడా ఆమోద పత్రాని తీసుకునేందుకు రాలేదని, ఈ పత్రాన్ని పొందకుండా వారు ఎటువంటి ఏ పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనకూడదని చెప్పారు.

ఆర్టీసీ కార్మికులకు ప్రశంసా పత్రాలు



డిపోకు అధిక ఆదాయం తెచ్చిన కండెక్టర్లకు చెక్కు అందజేస్తున్న ఆర్టీసీ డీఎం

ఆత్మకూరు: పట్టణంలోని ఏపీఎస్ ఆర్టీసీ డిపో ఆవరణలో శనివారం అధిక ఆదాయం తెచ్చిన కండక్టర్లు, అత్యధిక కేఎంపీఎల్ సాధించిన ఆర్టీసీ డ్రైవర్లకు డీఎం మహేంద్రుడు ప్రశంసాపత్రాలు అందజేశారు. శనివారం డిపోలో అధిక ఆదాయం తీసుకొచ్చిన కండక్టర్లు ముత్తుజాబీ, గోవిందయ్య, రెడ్డి, స్వామి, మోహన్, కె.ఎస్.రావు, రూపారాణి, ప్రతాప్, లక్ష్మి, నాగమ్మ, కేఎంపీఎల్ అధికంగా సాధించిన డ్రైవర్లు శివారెడ్డి, పి.ఆర్.సి. రెడ్డి, షేక్షావలి, దర్గయ్య, రమణ, నాయక్, ఎస్.ఆర్.రెడ్డి, అమ్మద్, ఎ.ఎం.బాషా, కరిముల్లాను అభినందించి నగదు చెక్కులను అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో సీఐ నాయక్, ఎంఎంబాషా, సిబ్బంది పాల్గొన్నారు.

ఫైలేరియా వ్యాధిగ్రస్తులకు కిట్ల పంపిణీ

ఆత్మకూరు: బైర్లూటి పరిధిలోని నల్లకాల్వ గ్రామంలో బైర్లూటి వైద్యాధికారి పవన్‌కుమార్ ఆధ్వర్యంలో ఫైలేరియా వ్యాధిగ్రస్తులకు ఫైలేరియా కిట్లను శనివారం పంపిణీ చేశారు. ఈ కిట్‌లో ఒక టబ్, ఒక టవాల్, ఒక ఆయింట్‌మెంట్, ఒక సబ్బు, ఒక మగ్ ఉన్నయని చెప్పారు. వ్యాధిగ్రస్తులు వ్యాధి సోకిన ప్రదేశాన్ని గోరు వెచ్చని నీటిలో సబ్బుతో శుభ్రరుచుకొని, శుభ్రమైన టవల్‌తో తుడుచుకుని ఆయింట్‌మెంట్ రాసుకోవాలని సూచించారు. సీహెచ్ఓ శివకుమార్, ఆరోగ్య కార్యకర్త భాస్కర్ పాల్గొన్నారు.

ప్రజలను బెదిరిస్తే ఊరుకోం



ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి



పార్టీలో చేరినవారితో ఎమ్మెల్యే శిల్పా

- ఇష్టం వచ్చినట్లు బెదిరిస్తే చట్ట ప్రకారం కేసులు పెడతాం
- సీతారామాపురంలో ప్రజాస్వామ్య పాలన తెస్తాం
- టీడీపీ నేత బుడ్డారెడ్డి శ్రీనివాసరెడ్డి అరాచకాలపై నిప్పులు చెరిగిన ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి
- టీడీపీని వీడి 200 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరిక

మహానంది: స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లయినా ప్రజలకు స్వేచ్ఛ లేకుండా టీడీపీ నేత చెప్పుచేతల్లో ఉంచుకోవాలనుకోవడం ఎక్కడి న్యాయమని, సామాన్య ప్రజలను ఇష్టం వచ్చినట్లు బెదిరిస్తే చూస్తూ ఊరుకునేది లేదని సీతారామాపురం గ్రామానికి చెందిన టీడీపీ నేత బుడ్డారెడ్డి శ్రీనివాసరెడ్డిపై శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం ఎమ్మెల్యే సీతారామాపురం గ్రామంలో పర్యటించారు. గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు కంతారెడ్డిగారి జమాల్‌రెడ్డి, వెలుగోటి జయనారపురెడ్డి, బుడ్డారెడ్డిగారి పెద్దిరెడ్డి ఘనస్వాగతం పలికారు. ఎమ్మెల్యే శిల్పా మాట్లాడుతూ శ్రీనివాసరెడ్డి మొన్నటి వరకు మా పార్టీలో తిరిగినా మంచిపేరు ఉందని నమ్మామన్నారు. ఆయన చేస్తున్న అఘాయిత్యాలు ఒక్కొక్కటిగా బయటికి వస్తుంటే నిజ స్వరూపం తెలుస్తుందని మండిపడ్డారు. పేదల భూములను లాక్కుంటూ.. కొనేది ఆయనే, అమ్మేది ఆయనే అన్న రీతిలో దౌర్జన్యం సాగుతుందన్నారు. ఫ్యాక్టరీ కట్టేందుకు పేదల భూములు ఆక్రమించాడని ఆరోపించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్లో ప్రజల నుంచి వాటాలు తీసుకోవడం సిగ్గుచేటని ఆగ్రహించారు. గ్రామంలో ప్రజలకు పథకాలు అందాలంటే ఇంటికి రూ. 25వేలు, స్థలానికి రూ. 20వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారని ప్రజలు ఆరోపిస్తున్నారని చెప్పారు. ఇన్నాళ్లు ఆయనకు భయపడి బయటకు చెప్పలేకపోయారన్నారు. రేషన్ బియ్యం సైతం ఆయన ఇంటికి వెళ్లి తీసుకోవాలని ప్రజలు చెబుతుంటే ఆవేదన కలుగుతుందన్నారు. ఇక నుంచి బుడ్డారెడ్డి శ్రీనివాసరెడ్డి దౌర్జన్యాలు సహించేది లేదని, ప్రజలను ఇష్టం వచ్చినట్లు బెదిరిస్తే ఫిర్యాదు చేసి.. చట్టప్రకారంగా కేసులు నమోదు చేయించి ప్రజలకు అండగా నిలుస్తామన్నారు. ఏకచత్రాధిపత్యం ఉన్న గ్రామంలో ప్రజాస్వామ్య పాలన తెస్తామని భరోసా ఇచ్చారు. శ్రీనివాసరెడ్డి నూతనంగా నిర్మించిన ఫ్యాక్టరీ భూముల విషయంపై విచారణ చేయించి ఆక్రమణలు ఉంటే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గుడి నిర్మాణం కోసం రైతుల నుంచి ఎకరాకు రూ. 6వేలు వసూలు చేశారని, ఏమయ్యా యని ఎవరైనా ప్రశ్నిస్తే బెదిరిస్తున్నాడన్నారు.

200 కుటుంబాలు చేరిక..

టీడీపీ నేత బుడ్డారెడ్డి శ్రీనివాసరెడ్డికి ఆయన గ్రామంలోనే వ్యతిరేకత రావడం మార్పునకు సంకేతమని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేతలు కంతారెడ్డిగారి జమాల్‌రెడ్డి, వెలుగోటి జయనారపురెడ్డి, బుడ్డారెడ్డిగారి పెద్దిరెడ్డి, పోగుల వెంకటరెడ్డి, పల్లం నాగేశ్వర్, సుబ్బరాయుడు ఆధ్వర్యంలో 200 కుటుంబాలు శనివారం టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరాయి. ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఎమ్మెల్యే శిల్పా మాట్లాడుతూ ఏ సమస్య వచ్చినా అర్ధరాత్రి ఫోన్ చేయండి స్పందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నియోజకవర్గ నేత శిల్పా భువనేశ్వరరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కొమ్మా మహేశ్వరరెడ్డి, బాచం నాగేశ్వరరెడ్డి, గోపవరం సొసైటీ చైర్మన్ వి.రామకృష్ణుడు, మండల నాయకులు తిమ్మాపురం వీరారెడ్డి, బూత్ కమిటీల కన్వీనర్ కుంచపు శ్రీనివాసులు, కందుల రఘురామిరెడ్డి, ఎస్సీ సెల్ కన్వీనర్ కోలా శ్రీనివాసులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అవ్వా...ఆశీర్వదించు



అవ్వతో ఆప్యాయంగా మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

మహానంది: అవ్వా...ఫ్యాన్ గుర్తుకే మన ఓటు వేయాలి, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా, తనను మరో సారి ఎమ్మెల్యేగా గెలిపించాలని శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అభ్యర్థించారు. సీతారామాపురం గ్రామంలో శనివారం ప్రజలతో పాటు అవ్వా, తాతలతో ఆయన ఆప్యాయంగా పలకరిస్తూ ముందుకు సాగారు. అవ్వా....నన్ను మళ్లీ ఆశీర్వదించాలంటూ విన్నవిస్తూ నడిచారు.

'ఫ్యాన్' గుర్తుకు ఓటు వేసి ఆశీర్వదించండి



వడ్డెమానులో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి దారా సుధీర్

- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దారా సుధీర్
- వడ్డెమాను, మల్యాలలో ఇంటింటి ప్రచారం

నందికొట్కూరు రూరల్ : ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్‌సీపీని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దారా సుధీర్ కోరారు. శనివారం మండల పరిధిలోని వడ్డెమాను, మల్యాల గ్రామాలలో ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు వైఎస్సార్‌సీపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం వారు ఇంటింటికీ వెళ్లి జగనన్న ప్రభుత్వంలో ప్రజలకు జరిగిన లబ్ధిని వివరించారు. రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించిన ఏకైక సీఎం జగనన్నే అన్నారు. ప్రతి పక్షాలు ఎన్ని కూటమిలు కట్టినా, ఎంత మంది కలిసి వచ్చినా మళ్లీ రాష్ట్రంలో జగన్‌దే హవా అని ధీమా వ్యక్తం చేశారు. 2014 నుంచి అధికారంలో ఉన్న చంద్రబాబు ప్రజలకు ఏమి చేశారో చెప్పే ధైర్యం ఉందా అని ప్రశ్నించారు. ప్రజలకు సంక్షేమ పథకాలు మళ్లీ అందాలంటే వైఎస్సార్‌సీపీ పార్టీకి రెండు ఓట్లు వేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి, ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ షుకూర్‌మియ్య, మండలాధ్యక్షుడు రవియాదవ్, జేసీఎస్ కన్వీనర్ ఓంకార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు కట్టా చంద్రశేఖర్, కట్టా రవి, ఆశోక్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మూడో రోజు ఒక్కటే నామినేషన్



నామినేషన్ దాఖలు చేస్తున్న శిల్పా కార్తీక్‌రెడ్డి

ఆత్మకూరు: శ్రీశైలం అసెంబ్లీ నియోజకవర్గ స్థానానికి శనివారం 3వ రోజు కేవలం ఒక్క నామినేషన్ మాత్రమే దాఖలైనట్లు ఆర్వో సుధారాణి తెలిపారు. వైఎస్సార్‌సీపీ తరఫున శిల్పా కార్తీక్‌రెడ్డి ఉదయం 11.25 గంటలకు నామినేషన్ దాఖలు చేసినట్లు చెప్పారు. శిల్పా కార్తీక్‌రెడ్డి, ప్రతిపాదకులు, మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యులు రషీద్, మున్సిపల్ వైస్ చైర్మన్ రాజగోపాల్ తదితరులు హాజరయ్యారు. తొలిరోజు గురువారం నాలుగు నామినేషన్లు, శుక్రవారం రెండు, శనివారం ఒకటి మాత్రమే దాఖలైనట్లు వెల్లడించారు.

నందికొట్కూరు: అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి మూడో రోజు ఒక్కరే నామినేషన్ వేశారని ఆర్వో దాసు తెలిపారు. శనివారం రెవెన్యూ కార్యాలయంలో తెలుగు దేశం పార్టీ తరుపున కాకరవాడ వెంకటస్వామి నామినేషన్ దాఖలు చేశారు.

ఎన్నికల ప్రచారంలో రేషన్ డీలర్లు



మిట్టకందాల రేషన్ డీలర్ బుడ్డన్న గౌరు వెంకటరెడ్డిని కలిసిన దృశ్యం



బైరెడ్డి రాజశేఖరరెడ్డి వెంట టీడీపీ కండువాతో ప్రచారంలో పాల్గొన్న రేషన్ డీలర్ మధుసూదన్‌గౌడు

పాములపాడు: టీడీపీ ఎన్నికల ప్రచారంలో రేషన్ డీలర్లు యథేచ్ఛగా పాల్గొంటున్నారు. శనివారం మిట్టకందాల గ్రామానికి చెందిన డీలర్ బుడ్డన్న టీడీపీలో చేరి పలువురి వెంట వెళ్లి గౌరువెంకటరెడ్డిని కలిశారు. అలాగే వేంపెంట గ్రామంలో రేషన్ డీలర్ మధుసూదన్‌గౌడు మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి వెంట మెడలో టీడీపీ కండువా వేసుకొని ప్రచారంలో పాల్గొన్నారు. ఎన్నికల నిబంధనల్లో రేషన్ డీలర్లు పాల్గొనకూడదని ఉన్నా.. వారు ఉల్లంఘించి ప్రచారాల్లో పాల్గొన్నారు.

దివంగత సర్పంచ్ మొమిన్ జిలానీకి నివాళి



వృద్ధులకు పండ్లు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆత్మకూరు: పట్టణంలోని వృద్ధాశ్రమంలో శనివారం ఆత్మకూరు మేజర్ గ్రామ పంచాయతీ దివంగత సర్పంచ్ మొమిన్‌జిలానీ వర్ధంతి సభను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో జిలానీ కుమారుడు మొమిన్ మునీర్‌బాషా మాట్లాడుతూ తమ కుటుంబ సభ్యులు మొమిన్ ఉసేన్‌సాహెబ్, తన తండ్రి జిలానీ 50 సంవత్సరాలు మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచులుగా సేవలందించారన్నారు. ఆత్మకూరు పట్టణాభివృద్ధికి ఎనలేని కృషి చేశారని తెలిపారు. అనంతరం వృద్ధాశ్రమంలోని వృద్ధులకు పండ్లు, బ్రెడ్లు, పాల ప్యాకెట్‌లను అందజేశారు. అనంతరం దివంగత సర్పంచ్ జిలానీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మన్సూర్ అలీ, సలావుద్దీన్, రఫీక్, ఖమరుద్దీన్, లాలు, అహ్మద్, బైరాపురం షేక్‌మహబూబ్‌బాషా, అలీబాషా, ముర్తుజా, ఇబ్రహీం, సుబ్బరాయుడు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గోవుల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి



గోశాలను పరిశీలిస్తున్న దేవస్థాన ఈఓ డి.పెద్దిరాజు

శ్రీశైలంటెంపుల్: ఎండ తీవ్రత రోజు రోజుకు అధికమవుతోందని, గోవుల సంరక్షణ పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని శ్రీశైల దేవస్థాన ఈఓ డి.పెద్దిరాజు సూచించారు. పరిపాలనంశాల పరిశీలనలో భాగంగా శనివారం దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గోశాల, ఉద్యానవనాలను పరిశీలించారు. ఈఓ మాట్లాడుతూ గోశాల ప్రాంగాణంలో గోవుల సంరక్షణ కోసం ఇప్పటికే చలువ పందిళ్లు ఏర్పాటు చేశామన్నారు. గోవులకు తగినంత మేతతో పాటు అధికంగా తాగునీరు అందిస్తుండాలని చెప్పారు. అవసరమైతే గోవులకు మరిన్ని నీటి తొట్లను కూడా ఏర్పాటు చేయాలని సూచించారు. గోవులకు అంటువ్యాధులు, సీజనల్ వ్యాధులు ప్రబల కుండా వాటికి కాలనుగుణంగా టీకా మందులను వేయించాలని ఆదేశించారు. అనంతరం ఉద్యానవనాల పరిశీలనలో భాగంగా భ్రామరీ పుష్పవనం, భ్రామరీ పుష్పవనం వెనుక భాగంలో 5ఎకరాల విస్తీర్ణంలో నాటిన మామిడి, నిమ్మ, బత్తాయి, సపోటా మొదలైన పండ్ల తోటలను పరిశీలించారు. దేవస్థానం పూలతోటలు, పండ్లతోటలు, ఉద్యానవనాలలో ఎప్పటికప్పుడు కలుపు మొక్కలను తొలగించాలని సూచించారు. సిబ్బంది సౌకర్యార్థం అన్ని తోటలు, ఉద్యానవనాలలో నీటికుండలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఉద్యానవన విభాగపు విశ్రాంత సహాయ సంచాలకులు ఈశ్వరరెడ్డి, సంబంధిత ఇంజనీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు శ్రీశైలంలో ఎమ్మెల్యే శిల్పా ప్రచారం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ఆదివారం శ్రీశైలం నుంచి సార్వత్రిక ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టనున్నారు. శనివారం రాత్రి ఎమ్మెల్యే శిల్పా శ్రీశైలం చేరుకున్నారు. శ్రీశైల శిఖరేశ్వరం చేరుకున్న ఎమ్మెల్యేకు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఆదివారం ఉదయం శ్రీశైలంలోని మహిషా సురమర్ధిని ఆలయం వద్ద అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రచారాన్ని మొదలుపెడతారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి ఎం.ఏ. రజాక్, పార్టీ నాయకులు అనిల్‌కుమార్, ఎడుకొండలు, పాపారావు, కుమార్ తదితరులు ఉన్నారు.

మద్యానికి డబ్బులు ఇవ్వలేదని...

జూపాడుబంగ్లా: మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వలేదని ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏఎస్ఐ మేరీ జయంతి శనివారం విలేకరులకు తెలిపిన వివరాల మేరకు..80 బన్నూరు గ్రామానికి చెందిన మండ్ల కళ్యాణ్(28) మద్యానికి బానిసై భార్య, పిల్లలను పట్టించుకొనేవాడు కాదు. దీంతో భార్య మండ్ల గిడ్డమ్మ పుట్టింటికి వెళ్లిపోయింది. తాగుడుకు డబ్బులివ్వాలని లేదంటే తన వాటా ఆస్తిని ఇవ్వాలంటూ అన్నదమ్ములతో తరుచూ గొడవపడేవాడు. ఈ నేపథ్యంలో మనస్తాపానికి గురైన మండ్ల కళ్యాణ్ శుక్రవారం రాత్రి ఇంట్లో ఆత్మహత్య చేసుకొన్నాడు. విషయం తెలుసుకొన్న పోలీసులు మృతదేహాన్ని కిందికి దించి పోస్టుమార్టం నిమిత్తం నందికొట్కూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడి భార్య గిడ్డమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

వలంటీర్ల రాజీనామా



నాగలూటిలో రాజీనామా పత్రాలను అందజేస్తున్న దృశ్యం

పాములపాడు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతు తెలిపేందుకు గ్రామ వలంటీర్లు స్వచ్ఛందంగా రాజీనామాలు చేశారు. శనివారం పాములపాడు, ఇస్కాల గ్రామాల్లో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులకు రాజీనామా పత్రాలు అందజేశారు. వలంటీర్లు షఫి, జంషీద్, రాజు, మౌలాలి, శ్రీను, వలి లు మాట్లాడుతూ రాష్ట్రంలో వలంటీర్ వ్యవస్థతో ఆర్థిక భరోసా కల్పించి, 50 కుటుంబాలకు సేవ చేసే భాగ్యాన్ని కల్పించిన జగనన్న కోసం మేము పని చేస్తామన్నారు.

పగిడ్యాల: మండలంలోని పడమర ప్రాతకోట సచివాలయం- 2 పరిధిలోని గ్రామ వలంటీర్లు శనివా రం తమ రాజీనామా పత్రాలను పంచాయతీ కార్యదర్శికి అందజేశారు. అలాగే పగిడ్యాలలో ఒకరు రాజీనామా చేశారు.

నందికొట్కూరు రూరల్ : మండల పరిధిలోని దామగట్ల, బిజినవేముల గ్రామాలకు చెందిన వలంటీర్లు శనివారం స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. వారు తమ రాజీనామా పత్రాలను పంచాయతీ కార్యదర్శులకు అందజేశారు. వారు మాట్లాడుతూ జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవడానికి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు.

మిడుతూరు: మండలంలోని చింతలపల్లి, దేవనూరు, మిడుతూరు-1, నాగలూటి, తలముడిపి గ్రామ సచివాలయాల పరిధిలో విధులు నిర్వహిస్తున్న 30 మంది వలంటీర్లు శనివారం స్వచ్ఛందంగా తమ రాజీనామ పత్రాలను ఎంపీడీఓ గంగావతికి సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ చంద్రబాబు వలంటీర్ల వ్యవస్థను హేళన చేస్తూ, దేశద్రోహులుగా చిత్రీకరించడంతో మనస్తాపానికి గురయ్యామన్నారు. జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకోవడానికి స్వచ్ఛందంగా రాజీనామా చేస్తున్నట్లు వెల్లడించారు.

జూపాడుబంగ్లా: మండలంలోని పారుమంచాల, మండ్లెం, 80బన్నూరు గ్రామాలకు చెందిన 30మంది వలంటీర్లు శనివారం స్వచ్ఛందంగా వారి విధులకు రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను ఎంపీడీఓ నూర్జహాన్, పంచాయతీ కార్యదర్శి సామేలు, విజయ్‌లకు అందజేశారు.

ఎంత మంది జతకట్టినా వైఎస్సార్‌సీపీదే విజయం

- ఏపీ శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి
- వైఎస్సార్‌సీపీలో 30 కుటుంబాలు చేరిక



వైఎస్సార్‌సీపీలో చేరిన తాటిపాడు గ్రామ టీడీపీ నాయకులు, కార్యకర్తలు

నందికొట్కూరు: ఎంత మంది జతకట్టినా చివరకు గెలిచేది వైఎస్సార్‌సీపీయే అని శాప్ రాష్ట్ర అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో జూపాడుబంగ్లా మండలం తాటిపాడు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుమలేశ్వరరెడ్డి, గ్రామ సచివాలయ కన్వీనర్ తరుణ్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో బైరెడ్డి సిద్ధార్థరెడ్డి సమక్షంలో మాజీ ఎంపీటీసీ, మాజీ సర్పంచు సుదర్శన్‌గౌడు, మొల్లా మాలిక్, సంచుల అబ్దుల్ రహిమాన్, మహమ్మద్ హుసేన్, రహంతుల్లా, మొల్ల హుసేన్, మొల్లా జాకీర్, యాసీన్, ముజీబుర్, షేక్ అహ్మద్, దాదామియా, సయ్యద్ మహబూబ్‌బాషా, షేక్ మీసాల బాబు, నూరుద్దీన్, రెహ్మాన్, హిమాంసా, గిడ్డ షాలు, ఇస్కాల షరీఫ్, మునలిమడుగు ఇమామ్‌సాహెబ్, షైపుల్లా, లక్ష్మణ్‌గౌడు, బోయలింగం, కోళ్ల వెంకటరమణ, వీరశేఖర్‌రెడ్డి, కుమార్‌గౌడ్‌తో పాటు 30 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరాయి. పార్టీలో చేరిన వారందరికీ సిద్ధార్థరెడ్డి వైఎస్సార్‌సీపీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు.

జగనన్న పాలనలోనే అభివృద్ధి

సీఎం వైఎస్ జగనన్న పాలనలోనే నియోజకవర్గంలో అభివృద్ధి సాధ్యమైందని సిద్ధార్థరెడ్డి చెప్పారు. సీఎం వైఎస్ జగనన్నపై రాళ్ల దాడి జరిగితే చంద్రబాబు నాయుడు హేళనగా మాట్లాడటం సిగ్గు చేటన్నారు. దాడికి భారీ మూల్యం చెల్లించకోక తప్పదన్నారు. కులాలకు, మతాలకు, పార్టీలకు అతీతంగా అర్హులైన పేద మహిళలకు బటన్ నొక్కి బ్యాంక్ ఖాతాలోకి నగదు జమ చేశారన్నారు. 58 నెలలో జరిగిన అభివృద్ధి గతంలో ఏ పాలనలో జరగలేదని గుర్తు చేశారు. ప్రతి నెల ఒకటో తేదీన తలుపు తట్టి అవ్వాతాతలకు, వితంతువులకు, వికలాంగులకు, ఒంటరి మహిళలకు పింఛన్లు ఇచ్చిన ప్రభుత్వం జగనన్న ప్రభుత్వమేనని చెప్పారు.

వివాహ వేడుకలో శిల్పా కార్తీక్‌రెడ్డి

ఆత్మకూరు: పట్టణంలోని 12వ వార్డు చిట్యాల వీధికి చెందిన శిల్పా వీరాభిమాని అయిన ముర్తుజావలి పెళ్లి వేడుకల్లో శనివారం శ్రీశైలం నియోజకవర్గ నాయకులు శిల్పా కార్తీక్‌రెడ్డి పాల్గొన్నారు. నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఆత్మకూరు పట్టణ ప్రజాప్రతినిధులు, నాయకులు, వార్డు ఇన్‌చార్జ్‌లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డుప్రమాదంలో ఒకరికి గాయాలు

మహానంది: బండిఆత్మకూరు మండలం సంతజూటూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలైన ఘటన శనివారం చోటు చేసుకుంది. నంద్యాల- వెలుగోడు మార్గంలో ఎదురుగా వస్తున్న బైకులు ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఆత్మకూరుకు చెందిన గణేష్ తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం 108లో నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

రేపు శ్రీశైలానికి చంద్రబాబు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్ల దర్శనార్థం సోమవారం టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు శ్రీశైలం రానున్నారు. సోమవారం ఉదయం 9.25గంటలకు హైదరాబాద్ బేగంపేట నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో బయలు దేరి 10.10 గంటలకు సున్నిపెంట హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డుమార్గం ద్వారా భ్రమరాంబా అతిథిగృహానికి చేరుకుంటారు. 12.30గంటలకు మల్లికార్జున స్వామివారిని, భ్రమరాంబాదేవిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించుకోనున్నారు.

ఎన్డీఏ కూటమికి ఎస్సీల ఓట్లు అవసరం లేదా..?



మాట్లాడుతున్న మాలమహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శి అంకన్న

పాములపాడు: టీడీపీ, బీజేపీ, జనసేన కూటమికి ఎస్సీల ఓట్లు అవసరం లేదా అని మాలమహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శి అంకన్న ప్రశ్నించారు. శనివారం మండల కేంద్రంలో మాట్లాడుతూ ఆయా పార్టీల నేతలు కేవలం బీసీ నినాదంతో ప్రచారంలో ముందుకు పోవడం తప్పితే ఎస్సీల గురించి మాట్లాడిన దాఖలాల్లేవన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ఇటీవల కొన్ని ప్రచార కార్యక్రమాల్లో ఎస్సీ వర్గీకరణ గురించి అనుకూలంగా మాట్లాడి అన్నదమ్ముల్లా ఉన్న మాల, మాదిగ కులాలను వేరు పరిచేలా చిచ్చుపెట్టడం ఏమిటని ప్రశ్నించారు. భారత దేశంలో మతతత్వ పార్టీలను, వాటికి కొమ్ముకాసి మద్దతిచ్చే పార్టీలను ప్రజలు నమ్మరని, ఓటు వేయరని స్పష్టం చేశారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలను మభ్య పెట్టే పార్టీలకు ఓటు వేయరాదని, అన్ని కులాలను సమానంగా భావించే పార్టీకి మద్దతిచ్చి గెలిపించాలని కోరారు. సమావేశంలో ఆ సంఘం జిల్లా నాయకులు అబ్రహాం తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ సారథిని మరోసారి గెలిపిద్దాం



గాజులపల్లెలో ప్రచారం నిర్వహిస్తున్న సొసైటీ చైర్మన్ గాజులపల్లె కిట్టు

మహానంది: పేదల సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమించే సంక్షేమ సారథి సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రి చేసుకుందామని గోపవరం సొసైటీ చైర్మన్, కేడీసీసీ డైరెక్టర్ గాజులపల్లె కిట్టు పిలుపునిచ్చారు. శనివారం గాజులపల్లె, బసవాపురం, ఆంజనేయపురం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం చేసిన మంచి పనులు, పేదలకు అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. మండల కేంద్రమైన ఎం.తిమ్మాపురంలో మండల యువనేత ఒంటెద్దు వీరారెడ్డి, తిమ్మాపురం సొసైటీ చైర్మన్ పగడాల నాగరాజు, నాగేశ్వర్‌రెడ్డి, పెద్దిశ్రీనివాసులు, మందా గోపాల్ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం చేపట్టారు.